సాక్షి సంగారెడ్డి

మంగళవారం । 14 । అక్టోబర్ । 2025



వడ్డీ వ్యాపారుల నయా దందా

వడ్డీ వ్యాపారుల నయా దందాకు తెరలేపారు. ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసిస్తేనే అప్పులు ఇస్తున్నారు. వివరాలు 8లో ▸



సైబర్ నేరాలపై అప్రమత్తం

యువకులు సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దని సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్ సూచించారు. వివరాలు 8లో ▸



ముంచెత్తుతున్న డ్రైనేజీ

పట్టణంలోని వసుంధరకాలనీని డ్రైనేజీ నీరు ముంచెత్తుతోంది. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణలతో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం అదనపు తరగతి గదులను ఆయన ప్రారంభించారు. మన ఊరు–మన బడి పథకం ద్వారా రూ.67 లక్షలతో నిర్మించిన 4 అదనపు తరగతి గదులు, ఆర్డీసీ కాంక్రీట్ ఇండస్ట్రీస్ సీఎస్ఆర్ నిధులు రూ.10 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన మరో రెండు అదనపు తరగతి గదులు ప్రారంభించారు. అయితే ప్రభుత్వం అందించే నిధులతో పాటు వివిధ పరిశ్రమల సహాయ సహకారాలతో నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఎంఈఓ నాగేశ్వరరావు నాయక్, పంచాయతీరాజ్ డీఈ సురేష్, ప్రమోద్ గౌడ్, ఆర్డీసీ పరిశ్రమ ప్రతినిధి నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



పీడీలు, పీఈటీలతో ఎంపికైన విద్యార్థులు

నారాయణఖేడ్: మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇర్ఫాన్, శానవాజ్, ఆజన్, ఫయాజ్ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గణపతి తెలిపారు. జిల్లాలోని గిర్మాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల గ్రౌండ్‌లో నిర్వహించిన అండర్ -19 ఉమ్మడి మెదక్ జిల్లా ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ క్రీడల్లో ప్రతిభ చాటారన్నారు. ఎంపికైన విద్యార్థులను గణపతితోపాటు గురుకుల ప్రధానోపాధ్యాయులు రాములు, పీఈటీ అజీజ్, సంతోష్, ధన్‌రాజ్, ఉపాధ్యాయులు సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు.

బెస్ట్ అవైలబుల్ బకాయిలు చెల్లించండి

కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్



మాట్లాడుతున్న అశోక్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు సంబంధించిన బకాయిలు చెల్లించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కీం డబ్బులు చెల్లించకపోవడంతో దళిత, గిరిజన విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు సంవత్సరాల నుంచి రూ.130 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలకు డబ్బులు రానందున అందులో చదువుతున్న విద్యార్థులు చదువును కొనసాగించలేకపోతున్నారని వాపోయారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు ప్రస్తుతం ఇంటికే పరిమితం అవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, నర్సింలు, మల్లేశం, సహాయ కార్యదర్శి జయరాం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు

ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి జోన్: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆన్‌లైన్ విధానంలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ పరితోష్ పంకజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 21న పోలీసు అమరవీరుల దినోత్సవంలో భాగంగా ఆరో తరగతి నుంచి పీజీ చదువుతున్న విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషలలో 500 పదాలకు మించకుండా రాసి పంపాలన్నారు. కాగా, పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజావాణిలో ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని ఎస్పీ సూచించారు. సోమవారం ప్రజల నుండి వినతులు స్వీకరించారు.

ఖనిజ సంపద లూటీ..!

నిశిరాత్రి వేళల్లో .. మైనింగ్ మాయ

- అక్రమ రవాణా చేస్తున్న 16 వాహనాలను పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్
- యథేచ్ఛగా రాయల్టీ, సీనరేజీ ఎగవేస్తున్నట్లు గుర్తింపు
- గనుల శాఖ మంత్రి ఇన్‌చార్జిగా ఉన్న జిల్లాలో వెలుగులోకి మైనింగ్ దందా



విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉన్నతాధికారులు పట్టుకున్న వాహనాలు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: భూగర్భ గనులశాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి వివేక్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న సంగారెడ్డి జిల్లాలో అక్రమ మైనింగ్ దందా మరోసారి వెలుగులోకి వచ్చింది. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా, గనులశాఖకు రూ.లక్షల్లో రాయల్టీ, సీనరేజీ ఎగవేస్తూ నిత్యం కొనసాగుతున్న ఖనిజ సంపదను అక్రమ రవాణా గుట్టును రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం రట్టు చేసింది. ఆ విభాగం రాష్ట్ర ఉన్నతాధికారులు రెండు రోజుల క్రితం జిల్లాలో ఆకస్మిక తనిఖీల్లో ఏకంగా 16 అక్రమ రవాణా చేస్తున్న వాహనాలు పట్టుబడ్డాయి. ఎలాంటి ట్రానిట్స్ పర్మిట్ లేకుండా ఖనిజ సంపదను హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ వాహనాలను జిల్లా భూగర్భ గనులశాఖ అధికారులకు అప్పగించగా పెద్ద మొత్తంలో జరిమానాలు విధించారు.

విచ్చలవిడి అక్రమ దందా

జిల్లాలో అపారమైన ఖనిజ సంపదను యథేచ్ఛగా కొల్లగొడుతున్నారనేదానికి ఈ ఘటన నిదర్శనంగా చెప్పవచ్చు. భూగర్భగనుల శాఖకు చెల్లించాల్సిన రాయల్టీ, సీనరేజీలను ఎగవేస్తూ, అర్ధరాత్రి వేళల్లో అడ్డూఅదుపు లేకుండా ఈ అక్రమ దందాను కొనసాగిస్తున్నట్లు మరోసారి రుజువైంది. గతంలో బీఆర్ఎస్ సర్కార్ హయాంలో రూ.వందల కోట్ల రాయల్టీ ఎగవేసిన ప్రజాప్రతినిధులు, నేతలే ఈ ప్రభుత్వం హయాంలోనూ ఈ దందాను కొనసాగిస్తున్నారనేది రుజువైంది. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఒక్క రాత్రి తనిఖీ చేస్తే ఏకంగా 16 వాహనాలను పట్టుకున్నారంటే నిత్యం ఏ స్థాయిలో అక్రమ రవాణా జరుగుతుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఖనిజ సంపదను లూటీ చేయడానికి మరిగిన ప్రజాప్రతినిధులు, నాయకుల అక్రమార్జనకు అడ్డే లేకుండా పోయిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చేష్టలుడిగి చూస్తున్న జిల్లా అధికారులు

జిల్లాలో విచ్చలవిడిగా మైనింగ్ అక్రమ రవాణా జరుగుతుంటే భూగర్భ గనులశాఖ జిల్లా అధికారులు పట్టించుకోకపోవడం పలు ఆరోపణలకు దారితీస్తోంది. నిత్యం తనిఖీలు చేస్తూ అక్రమ మైనింగ్ వాహనాలపై ఉక్కుపాదం మోపాల్సిన ఆశాఖ అధికారులు చేష్టలుడిగి చూస్తుండటం పలు విమర్శలకు దారితీస్తోంది. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రాష్ట్ర విభాగం తనిఖీల్లో ఈ అక్రమ రవాణా వాహనాలు పట్టుబడుతుంటే, జిల్లా అధికారులు తనిఖీలు చేస్తున్నప్పుడు ఎందుకు పట్టుబడటం లేదనే ప్రశ్న తలెత్తుతోంది. దీన్ని బట్టి చూస్తే ఆశాఖ జిల్లా అధికారుల కనుసన్నల్లోనే ఈ అక్రమ దందా కొనసాగుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నారు. ఈ తనిఖీల కోసం భూగర్భ గనులశాఖ ప్రత్యేకంగా తనిఖీల బృందాలను నియమించింది. ఈ బృందాలు కూడా ఈ అక్రమ రవాణాను చూసీచూడనట్లు వదిలేస్తుండటంతో విలువైన ఖనిజ సంపద లూటీ అవుతున్నట్లు తేలుతోంది.

పిలిస్తే వెళ్లి జరిమానా విధించాం

రెండు రోజుల క్రితం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పిలిస్తే వెళ్లాం. అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను పట్టుకొని మాకు అప్పగించారు. వాటికి జరిమానాలు విధించాం. ఎన్ని వాహనాలను పట్టుకున్నాం.. ఎంత జరిమానా వివరాలు కార్యాలయంలో ఉన్నాయి.

– రవిబాబు, భూగర్భ గనులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్

తడిసి ముద్దయింది..

- మూడు నెలల్లో సాధారణం కంటే అధికంగా 348 మి. మీ వర్షపాతం
- పంటలపై తీవ్ర ప్రభావం
- దిగుబడులు నష్టపోతున్న రైతులు



అధిక వర్షాలతో పంట చేలో నిలిచిన నీరు

సాధారణం	544 మి.మీ
కురిసింది	892 మి.మీ
అధికంగా	348 మి.మీ

నారాయణఖేడ్: ఈ వర్షాకాలంలో అతి భారీ వర్షాలు కురిశాయి. జిల్లాలో సాధారణం కంటే అధికంగా వర్షం కురవడంతో పంటలు భారీగా దెబ్బతిన్నాయి. ఈ సీజన్ రైతన్నకు నష్టాన్నే మిగిల్చింది. జూన్ మాసంలో లోటు వర్షపాతం కురిసి.. తర్వాత నెలల నుంచి దంచి కొట్టింది. ప్రతీ నెలలోనూ అధిక వర్షపాతం నమోదైంది. జిల్లాలో జూన్‌లో 121 మి.మీ వర్షపాతం నమోదు కాగా, 53 మి.మీటర్లు మాత్రమే కురిసింది. జూలైలో 191 మి.మీకు గాను 205 మి.మీటర్లు కురిసి 14మి.మీ అధికంగా, ఆగస్టులో 191మి.మీటర్లకు గాను 441మి.మీ కురిసింది. సెప్టెంబర్‌లో 162 మి.మీటర్లు కురియాల్సి ఉండగా 246 మి.మీ కురిసి 84మి.మీ అధిక వర్షపాతం నమోదైంది. జిల్లాలో సాధారణంగా 544 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకు మించి 892 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసింది. అంటే మూడు నెలల కాలంలో 348 మిల్లీమీటర్ల వర్షం అధికంగా కురిసింది. భారీ వర్షాల వల్ల పెసర, మినుము పంటలు వంద రోజుల్లో చేతికి వస్తుంది. ఈ సమయంలో అధిక వర్షాల వల్ల నాని దెబ్బతింది. మార్కెట్‌లో పెసర, మినుము పంటలకు ధర లేకుండా పోయింది.

అధిక వర్షాలతో నష్టం

అధికంగా, నిరంతరాయంగా వర్షాలు కురియడం వల్ల పంటలకు నష్టం వాటిల్లుతుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. పొలంలో నీరు నిలవడం వల్ల వేర్లకు ఆక్సిజన్ కొరత ఏర్పడటం, నేల లోని గాలి ఖాళీలు నీటితో నిండిపోయి వేర్లకు ఆక్సిజన్ సరఫరా నిలిచిపోతుంది. వేర్లు కుళ్లిపోయాయి. అధిక వర్షాల వల్ల నీటిలోని పోషకాలు కొట్టుకుపోవడం వల్ల మొక్కకు పోషక పదార్థాలు అందకుండా పోతాయి. స్వల్ప కాలికాలైన పెసర, మినుము పంటలు వర్షం వల్ల నాని దెబ్బతిన్నాయి. పెసర, మినుము ఎకరంలో 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా మూడు క్వింటాళ్ల వరకు మాత్రమే వచ్చిందని రైతులు పేర్కొంటున్నారు. పంట నానడం వల్ల మార్కెట్‌లో ధర లేకుండా పోయింది. కంది పంటకు వేరు కుళ్లు తెగులు సోకుతోంది. దీంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపనుంది. సోయా పంట నీరు నిలువడం వల్ల కాయలు పగిలి గింజలు రాలిపోనున్నాయి. మొక్కజొన్న సున్నితమైన పంట కావడం..నీరు నిలువడం వల్ల కాండం కుళ్లు తెగులు, వేరు కుళ్లు తెగులు, చీడపీడల సమస్య అధికంగా ఉండనుంది.

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

నారాయణఖేడ్: నారాయణఖేడ్‌లో ఈనెల 14వ తేదీన కాంగ్రెస్ క్యాకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. పట్టణంలోని సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు డీసీసీ అధ్యక్షుడి నియామకం విషయంలో కార్యకర్తల అభిప్రాయాల సేకరణ, కాంగ్రెస్ బలోపేతం, స్థానిక ఎన్నికల్లో గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నారు. జిల్లా పరిశీలకురాలు సిజరిట, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొననున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తు తీసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తారా ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ, పీజీ విద్యార్థులకు బోధించేందుకు ఆంగ్లంలో రెండు, పొలిటికల్ సైన్స్‌లో రెండు, తెలుగు రెండు, గణితం రెండు, రసాయన శాస్త్రం రెండు, బోటనీ రెండు, కంప్యూటర్ సైన్స్ రెండు, జువాలజీ ఒకటి, కామర్స్ ఒకటి విభాగాల్లో అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటికి సంబంధించి ఈ నెల 17న శుక్రవారం ఉ.10 గంటల నుంచి కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అర్హులైన అభ్యర్థులు అన్నీ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక జిరాక్స్ సెట్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకొని కళాశాలలో జరిగే డెమో, ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

మీ మద్దతు ఎవరికి..?



మాట్లాడుతున్న ఝరిత, చిత్రంలో జగ్గారెడ్డి, నిర్మల

- డీసీసీ అధ్యక్షుడి ఎంపికపై అభిప్రాయ సేకరణ
- కాంగ్రెస్ నేతలతో ఏఐసీసీ పరిశీలకులు భేటీ

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్ష పదవి నియామక ప్రక్రియలో భాగంగా ఏఐసీసీ పరిశీలకులు ఝరిత ఆ పార్టీ నాయకులతో అభిప్రాయ సేకరణ చేపట్టారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలతో కలిసి సోమవారం సంగారెడ్డి నియోజకవర్గం కాంగ్రెస్ శ్రేణులతో సమావేశమయ్యారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, పట్టణ, మండలాల అధ్యక్షులు, వివిధ విభాగాల బాధ్యులతో ముఖాముఖి నిర్వహించి అభిప్రాయ సేకరణ చేశారు. డీసీసీ అధ్యక్షుడిగా ఎవరిని నియమిస్తే బాగుంటుందని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఝరిత మాట్లాడుతూ డీసీసీ అధ్యక్ష పదవి కోసం ఆసక్తి ఉన్న నాయకులు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. డీసీసీ పదవుల విషయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా, 50 ఏళ్లలోపు ఉన్న వారికి 50 శాతం రిజర్వేషన్ ఉంటుందని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో డీసీసీ అధ్యక్ష పదవి కీలకం కాబోతుందని, ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీతో డీసీసీ అధ్యక్షులు నేరుగా మాట్లాడే అవకాశం ఉంటుందని అన్నారు.

వెంటనే రోడ్లకు మరమ్మతులు



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య, చిత్రంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అధికారులు

కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశం

సంగారెడ్డి జోన్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారుల మరమ్మతుల పనులు వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు రవాణా సౌకర్యం లేని గిరిజన తండాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ విభాగం నుంచి మంజూరైన నిధుల నుంచి పనులు చేపట్టేందుకు టెండర్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి తదితరులు పాల్గొన్నారు.

కోరిన సమాచారం అందించాలి

సమాచార హక్కు చట్టంలో భాగంగా దరఖాస్తుదారుడు కోరిన సమాచారాన్ని పూర్తిస్థాయిలో అందించాలని కలెక్టర్ సూచించారు. సమాచార హక్కు చట్ట వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తి సమాచారంతో కూడిన సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

ప్రజావాణికి 38 దరఖాస్తులు

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులతో కలిసి ప్రజల నుంచి సమస్యలపై వినతులను స్వీకరించారు. ఈ మేరకు 38 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

విద్యార్థుల పాత్ర కీలకం

సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ పి.రాజీవ్



ప్రధానమంత్రి ప్రత్యక్ష కార్యక్రమాన్ని వీక్షిస్తున్న అధికారులు, విద్యార్థులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతదేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా నిర్మించడంలో విద్యార్థుల పాత్ర కీలకమని రాష్ట్ర సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ పి.రాజీవ్ తెలిపారు. సోమవారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్‌నగర్ కస్తూర్బా పాఠశాలలో జరిగిన ప్రధానమంత్రి ప్రత్యక్ష కార్యక్రమంలో విద్యార్థులతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు వారి మేధాశక్తితో నూతన పరికరాలను తయారు చేసే విధంగా ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా ఉస్మాన్‌నగర్ కస్తూర్బా పాఠశాల విద్యార్థులు పబ్లిక్ టాయిలెట్ ఆటో ఫ్లష్ పరికరాన్ని తయారు చేశారన్నారు. ప్రధానమంత్రి ప్రత్యక్ష కార్యక్రమానికి కస్తూర్బా పాఠశాలతో పాటు రంగారెడ్డి జిల్లాకు చెందిన పాఠశాల ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంఓ బాలయ్య, జిల్లా సైన్స్ అధికారి సిద్దిరెడ్డి, జిల్లా జీఈసీఓ సునీత కన్న, ఎంఈఓ పీపీ రాథోడ్, కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారిణి కవిత తదితరులు పాల్గొన్నారు.

పోలియోపై అపోహలు వద్దు

- డీఎంహెచ్‌ఓ నాగ నిర్మల
- భీంరాలో శిశువు మృతిపై విచారణ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ నాగనిర్మల, చిత్రంలో సంధ్యారాణి

కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టి మండలం భీంరాలో ఆదివారం పోలియో చుక్కలు వేసిన వెంటనే శిశువు మృతి చెందడంతో సంబంధిత కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ నాగనిర్మల, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సంధ్యారాణి సందర్శించారు. శిశువుకు వేసిన చుక్కల మందు సీసాను పరిశీలించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మీడియాతో మాట్లాడుతూ.. పోలియో చుక్కల మందుపై అపోహలు వద్దని తెలిపారు. జిల్లాలో 1.86 లక్షల మంది చిన్నారులకు చుక్కలు వేసినట్లు పేర్కొన్నారు. భీంరాలో మృతి చెందిన శిశువుతో పాటు 108 మందికి చుక్కల మందు వేశామన్నారు. శిశువు అనారోగ్యంతోనో, లేక ఏడుస్తుండగానే పోత పాలు పట్టడంతో పాలు ఊపిరితిత్తుల్లోని వెళ్లి శ్వాస ఆడగంతోనో జరిగి ఉంటుందని అన్నారు. పోస్టుమార్టం అందిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ నాగమణి ఉన్నారు.

వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలి

పోలియో చుక్కలు వేసి మా బాబు మృతికి కారణం అయిన వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని శిశువు తల్లి స్వర్ణలత బంధువులు సోమవారం కంగ్టి తహసీల్దార్ భాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు. పోస్టుమార్టం రిపోర్టు రాక ముందే డీఎంహెచ్‌ఓ తమ శిశువు మృతికి పోలియో చుక్కలు కారణం కాదని తెలపడంతో ప్రభుత్వ వైద్య సిబ్బందిపై అనుమానం పెరిగిందన్నారు. బాధ్యులైన వైద్య సిబ్బందిపై చర్యలతో పాటు ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

తప్పని సరిగా పోలియో చుక్కలు

జహీరాబాద్: ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కల మందును తప్పని సరిగా వేయించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ గాయత్రిదేవి సూచించారు. సోమవారం న్యాల్‌కల్‌లోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఏ ఒక్కరూ మిస్ కాకుండా చుక్కల మందు వేయించేలా చూడాలన్నారు. సమావేశంలో వైద్యులు అమృత్‌రాజ్ పాల్గొన్నారు.

ఆదాయం తక్కువ.. ఖర్చులు ఎక్కువ

- జిన్నారం మున్సిపాలిటీని వెంటాడుతున్న నిధుల కొరత
- వేతనాలు అందక పారిశుద్ధ్య కార్మికుల అవస్థలు



వేతనాలు అందకపోవడంతో నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

ఇటీవల కొత్తగా ఏర్పాటు అయిన జిన్నారం మున్సిపాలిటీ సమస్యలతో సతమతమవుతోంది. గ్రామ పంచాయతీగా ఉన్న మండలాన్ని ప్రభుత్వం మున్సిపాలిటీగా మార్చడంతో సమస్యలు మాత్రం తీరలేదు. పైగా ఆదాయ, వ్యయాలు పక్కన పెడితే సిబ్బందికి, పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిన్నారం (పటాన్‌చెరు): కాంగ్రెస్ ప్రభుత్వం జిన్నారం మండలాన్ని ఇటీవల మున్సిపాలిటీగా మార్చింది. పట్టణీకరణ వృద్ధి చెందకుండా ప్రభుత్వం ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడంపై నిరసనలు కూడా వ్యక్తమయ్యాయి. మున్సిపాలిటీగా మారిన తర్వాత నిధుల కొరత ఏర్పడింది. దీంతో సిబ్బంది, కార్మికులకు నాలుగు నెలలుగా సమయానికి జీతాలు లేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై మున్సిపల్ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు మున్సిపాలిటీకి ఆదాయం కూడా లేకపోవడంతో పరిస్థితి దారుణంగా ఉంది.

నిర్వహణ భారం

కొత్త మున్సిపాలిటీ నిర్వహణ రోజురోజుకు భారంగా మారుతుంది. దీంతో పన్నుల భారం పడుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు నిర్ణయాల వల్లే ఇటువంటి సమస్యలు తలెత్తాయని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ వద్దని చెప్పినా ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం తీసుకుందని ఇందుకు మున్సిపాలిటీలో తలెత్తిన సమస్యలేనని చెబుతున్నారు. రాను రాను ఇంటి పన్నులు భారీగా పెరిగే అవకాశం ఉందని భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు.

ఖర్చులు ఘనం..

జిన్నారం మున్సిపాలిటీలోని 10 గ్రామాల నుంచి ఏటా రూ.38 లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. కాగా మున్సిపల్ నిర్వహణలో ఖర్చు మాత్రం కోటి వరకు ఉంటుందని లెక్కలు చెబుతున్నాయి. దీనిలో ఎక్కువ భాగం సిబ్బంది వేతనాలకు 70 లక్షలు వరకు చెల్లించాల్సి వస్తోంది. ఖర్చులు పెరుగుతూ నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో అభివృద్ధి లేక, పాలన భారంగా మారింది.

త్వరలో అందజేస్తాం



పారిశుద్ధ్య కార్మికులకు గ్రామపంచాయతీగా ఉన్నప్పటి నుంచి జీతాలు అందలేదు. ప్రస్తుతం మున్సిపాలిటీకి సంబంధించిన నెల రోజుల వేతనం ఇవ్వాల్సి ఉంది. మండలం నుంచి పట్టణంగా మారడంతో కార్మికులకు నూతన బ్యాంకు ఖాతాలను ప్రారంభించి 15 రోజుల్లో జీతాలు అందజేస్తాం. త్వరలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

– తిరుపతి (జిన్నారం మున్సిపల్ కమిషనర్)

క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్రబోస్



మాట్లాడుతున్న డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్

హవేళిఘణాపూర్(మెదక్): యువకులు సైబర్ నేరాలు, డ్రగ్స్ భారిన పడకుండా తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముత్తాయికోటలో విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో పాల్గొని మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసై ఎందరో తమ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మురళి, డాక్టర్ శరత్, సాయికిరణ్, నాగరాజు, హెచ్‌ఎం రఘుబాబు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం


పట్టుబడిన రేషన్ బియ్యం

శివ్వంపేట(నర్సాపూర్): అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని సీసీఎస్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమ వారం మండల పరిధిలోని పాంబండలో సీసీఎస్ పోలీసులు దాడులు చేసి ఓ పౌల్ట్రీఫామ్‌లో 12 బస్తాల రేషన్ బియ్యం (6 క్వింటాళ్లు) పట్టుకున్నారు. అనంతరం రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని శివ్వంపేట పీఎస్‌కు తరలించారు. వారి ఫిర్యాదు మేరకు సివిల్ సప్లయ్, రెవెన్యూ సిబ్బంది విచారణ చేపట్టారు.

ముగ్గురు దొంగలు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ షేక్ మహబూబ్

మద్దూరు(హుస్నాబాద్): ధాన్యాన్ని అపహరించి తీసుకెళ్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన మండలంలోని కూటిగల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ షేక్ మహబూబ్ కేసు వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన అల్ల కొమురయ్య మొక్కజొన్న పంటను కోసి ఆరబెట్టాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలకు చెందిన గంటల శంకర్, పండుగ సతీశ్, బదుగు సంపత్ సుమారు 12 క్వింటాళ్ల మక్కలను అపహరించి హుస్నాబాద్‌కు తరలిస్తున్నారు. రాత్రి వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు అనుమానాస్పందగా కనిపించడంతో విచారించగా దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

వడ్డీ వ్యాపారుల నయా దందా



భూములు రిజిస్ట్రేషన్ చేస్తేనే అప్పులు

- సర్వహక్కులు కోల్పోయే ప్రమాదం
- తేడాలొస్తే భవిష్యత్‌లో ఇబ్బందులే
- మార్టిగేజే బెటర్ అంటున్న న్యాయ నిపుణులు

గతంలో బంగారం కుదవపెట్టి, ప్రామిసరీ నోట్లు రాసిస్తే వడ్డీ వ్యాపారులు అప్పులిచ్చేవారు. కానీ ఈ మధ్యకాలంలో ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసిస్తేనే అప్పులు ఇస్తున్నారు. ఈ నయా దందాకు వడ్డీ వ్యాపారులు తెరలేపారు. అయితే ఈ విధానంతో భవిష్యత్తులో సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని న్యాయ నిపుణులు, పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. కాగా మార్టిగేజ్ చేసి బ్యాంకుల నుంచి అప్పు తీసుకుంటే తీసుకున్న వారు సేఫ్‌గా ఉంటారని చెబుతున్నారు.

– జోగిపేట(అందోల్)

జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఫైనాన్స్‌కు చెందిన వారు సిండికేట్‌గా ఏర్పడి జోగిపేట, సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాల్లోని రైతులకు, చిన్న చిన్న వ్యాపారులకు అధిక వడ్డీతో అప్పులు ఇస్తున్నారు. ఇందుకు భూములనే కాకుండా భవనాలు, కమర్షియల్ షట్టర్‌లను రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు.

దళారులకు పండుగ

వ్యవసాయ భూమిపై అప్పులిస్తామని చెప్పి ప్రతి గ్రామంలో ఒకరిద్దరూ దళారులు ఉన్నారు. వారు అప్పు ఇచ్చే వ్యక్తులకు తీసుకునే వారిని పరిచయం చేసి డబ్బులు ఇప్పించి రిజిస్ట్రేషన్ వరకు ప్రధాన బాధ్యత తీసుకుంటారు. ఇలా రిజిస్ట్రేషన్ చేయించినప్పుడు 2 శాతం కమీషన్‌ను తీసుకుంటున్నారు.

ఇటీవల ఓ ఘటన

దాకూరు గ్రామానికి చెందిన బోయిని కృష్ణ అందోలు మండలంలోని కొంత మంది రైతులకు, ప్రైవేట్ వ్యక్తులకు అప్పులిచ్చి భూములను తన పేర రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆ తర్వాత ఇదే భూమిని రూ.50 లక్షలు, కోటి రూపాయల వరకు ఇతరులకు అమ్ముకున్నాడు. అప్పు తీసుకున్న రైతులు లబోదిబోమన్నారు. ఇప్పటి వరకు రూ.20 కోట్ల వరకు రిజిస్ట్రేషన్ చేయించుకుని ఉడాయించాడు. దాకూరు గ్రామానికి చెందిన భాగయ్య కృష్ణపై కేసు పెట్టాడు. కాగా ఆరు మాసాలుగా కృష్ణ పరారీలో ఉన్నాడు.

భూమి వాల్యూ తక్కువతోనే..

అధికారికంగా భూముల విలువ తక్కువగా ఉండటంతో బ్యాంకర్లు ఆ మేరకు రుణాలు ఇస్తున్నారు. ఎకరాకు రూ.2.50 లక్షల నుంచి రూ.3.60 లక్షలు మాత్రమే వాల్యూ ఉండటం వల్ల బ్యాంకర్లు భూమిని మార్టిగేజ్ చేసుకొని రూ.2 లక్షల వరకు రుణాలు ఇస్తున్నారు. ప్రైవేట్ ఫైనాన్స్ అయితే ఎకరాకు రూ.10 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు ఇస్తున్నట్లు సమాచారం. ఇక్కడ డబ్బులు తీసుకున్నప్పుడు, విడిపించుకున్నప్పుడు రిజిస్ట్రేషన్ చేసే సమయంలో ఆ ఫీజును అప్పు తీసుకున్న వ్యక్తే చెల్లించాలి. దీంతో అదనపు భారం పడటంతోపాటు భూమిపై సర్వహక్కులు కోల్పోవలసి వస్తుంది.

కేసులు పెడుతున్నాం



ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకుని అప్పులు ఇవ్వడం కరెక్ట్ కాదు. ప్రజల్ని మోసం చేసినట్లు రుజువైతే కేసులు పెడుతున్నాం. ఇటీవల దాకూరు గ్రామానికి చెందిన బోయిని కృష్ణపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశాం. కొన్ని సందర్భాల్లో నేరాలు జరిగే ప్రమాదం ఉంటుంది. ఎవరైనా మోసపోతే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

అనీల్‌కుమార్, సీఐ జోగిపేట.

చట్ట ప్రకారం అగ్రిమెంట్లు చెల్లవు



మార్టిగేజ్ ప్రాపర్టీస్‌కే లీగల్‌రైట్స్ ఉంటాయి. అప్పుల కోసం ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం సరికాదు. ఇంటర్నల్‌గా రెండు పార్టీలు బాండ్ పేపర్లపై, తెల్లకాగితాలపై చేసుకునే అగ్రిమెంట్లు కోర్టు అంగీకరించదు. సేల్‌డీడ్ ఉంటే ఆస్తిపై సర్వహక్కులు కోల్పోయినట్లే. అప్పు తీసుకున్న వ్యక్తి దగ్గర ఒరిజినల్ డాక్యుమెంట్ ఉన్నా.. కబ్జాలో తామే ఉన్నట్టు రుజువు చూపిస్తే కొంత వరకు సేఫ్. కోర్టులో ప్రూవ్ చేయడానికి చాలా సమయం పడుతుంది. బ్యాంకులు మార్టిగేజ్ చేసుకుంటాయి తప్పా ఆస్తులను అనుభవించవు. ప్రైవేటు వడ్డీ వ్యాపారులు ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం మంచి విధానం కాదు.

- సార వెంకటవర్మ, న్యాయవాది, జోగిపేట

బడులకు అకాడమిక్ క్యాలెండర్లు

- సెలవులు, పరీక్షలు ముందుగా తెలుసుకోవచ్చు
- ప్రభుత్వ పాఠశాలకు పంపిణీ చేసిన విద్యాశాఖ

పటాన్‌చెరు టౌన్: విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల్లో అకాడమిక్ క్యాలెండర్లు ఉంచాలని నిర్ణయించింది. ప్రతి నెలా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. సెలవులు, పరీక్షలు ఎప్పుడు ఉంటాయో ఉపాధ్యాయులకు తప్ప విద్యార్థులకు తెలియడం లేదు. అందుకే విద్యా సంవత్సరంలో ఏ నెలలో ఏఏ కార్యక్రమాలు నిర్వహిస్తారో అన్ని వివరాలు తెలిసేలా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. 2025–26 విద్యా సంవత్సరానికి ఎస్సీ ఈఆర్టీ దీనిని రూపొందించింది. ప్రతీ పాఠశాలతోపాటు మండల విద్యాధికారి, జిల్లా విద్యాధికారి, కలెక్టర్ కార్యాలయంలో రెండేసి చొప్పున ఉంచాలని ఆదేశాలిచ్చింది. ఇప్పటికే జిల్లా పరిధిలోని ప్రైమరీ స్కూల్ 863, అప్పర్ ప్రైమరీ స్కూల్ 191, హైస్కూల్స్ 241లకు పంపిణీ చేసినట్లు డీఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

పొందుపర్చిన అంశాలు

- పరీక్షల షెడ్యూల్లో ఎఫ్‌ఏ–1 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షల వరకు ఏయే తేదీల్లో నిర్వహించాలో, అలాగే వార్షిక షెడ్యూల్‌లో బడిబాట, పాఠశాలల పునఃప్రారంభం, పండుగలు, వేసవి సెలవులు ఇలా అన్ని వివరాలు ఉంటాయి.
- స్కూల్ ప్రిపరేషన్ మాడ్యూల్ ఒకటి నుంచి పదో తరగతి వరకు సిలబస్‌ను ఎప్పుడు పూర్తి చేయాలి. పునశ్చరణ తరగతుల నిర్వహణ వంటి వివరాలు ఉన్నాయి.
- ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు పని చేసే సమయాలను అందులో పొందుపర్చారు. ప్రతి నెలలో నిర్వహించే కార్యక్రమాలు, సముదాయ సమావేశాలు, పాఠశాల స్థాయిలో నిర్వహించే పోటీల వివరాలు, సైన్స్ ఎగ్జిబిషన్లు, సెమినార్ల వివరాలు.
- జూన్ నుంచి ఏప్రిల్ వరకు ప్రతినెల పాఠశాల పనిదినాలు ఎన్ని ఉంటాయి. పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఎప్పుడు నిర్వహించాలో అందులో వివరంగా ఉంటాయి. కో–కరిక్యులర్ యాక్టివిటీలో ఆరోగ్యం, కంప్యూటర్, కళలు, సంస్కృతి, జీవన నైపుణ్యాలు, విలువలకు సంబంధించి వారంలో ఎన్ని పీరియడ్లు తీసుకోవాలో పొందుపర్చారు.

అందరికీ తెలిసేలా..



విద్యా సంవత్సరంలో ఏ నెలలో ఏఏ కార్యక్రమాలు నిర్వహించాలి. పరీక్షలు, సెలవులు, సమావేశాల నిర్వహణ వంటి అన్ని విషయాలు తెలిసేలా అకాడమిక్ క్యాలెండర్లు రూపొందించారు. జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అకాడమిక్ క్యాలెండర్లను పంపిణీ చేశాం. దీని ద్వారా సమాచారం అందరికి సులువుగా తెలుస్తుంది.

-జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు

భద్రతా ప్రమాణాలు పాటించాలి


ప్రవీణ్ కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సురేందర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతి ఒక్కరూ పనులు చేసే సమయంలో భద్రత నియమాలు పాటించాలని కార్మిక శాఖ అధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. సోమవారం రాష్ట్ర లోక్ జనశక్తి పార్టీ రామ్‌విలాస్ లేబర్ సేల్ అధ్యక్షుడు సురేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్మిక చట్టాలపై అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, చారి, జనార్దన్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడు గల్లంతు


నదిలో గాలింపు చర్యలు చేపడుతున్న సహాయక బృందాలు (ఇన్సెట్లో)గల్లంతైన సురేశ్

కొల్చారం(నర్సాపూర్): చేపల వేటకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు నదిలో పడి గల్లంతయ్యాడు. ఈ ఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. కొల్చారం ఎస్‌ఐ హైమద్ మోహినోద్దీన్ వివరాల ప్రకారం... మండలంలోని అప్పాజీపల్లి గ్రామానికి చెందిన బుడ్డెన్నోళ్ల సురేశ్ ఆనకట్టకు నీటి ప్రవాహం తగ్గడంతో చేపల వేటకు వెళ్లాడు. ఆనకట్ట దిగువన చిన్నఘనాపూర్ పరిధిలోని మెకానికల్ బ్రిడ్జి వైపు చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు నదిలో పడి గల్లంతయ్యాడు. కొద్ది దూరంలో ఉన్న జాలరులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ మెదక్ నుంచి అగ్నిమాపక సిబ్బందితోపాటు టీజీఎఫ్ బృందాలను రప్పించి గాలించారు. చీకటి పడటంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. తిరిగి మంగళవారం గాలింపు చర్యలు చేపడతామని ఎస్సై తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం


యూసుఫ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండలంలోని చండూర్ గ్రామంలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్‌ఐ నర్సింహులు వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన దూదేకుల యూసుఫ్ మద్యానికి బానిసై తరుచూ తాగి భార్య రిజ్వానాతో గొడవపడేవాడు. ఈ క్రమంలో ఈ నెల 3న తాగి వచ్చిన యూసుఫ్ భార్యతో గొడవపడ్డాడు. అనంతరం రాత్రి 9 గంటలకు కుటుంబసభ్యులతో భోజనం చేసి పడుకున్నాడు. తెల్లవారిన తరువాత చూస్తే యూసుఫ్ కనపడలేదు. దీంతో కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం స్నేహితులు, బంధువుల వద్ద ఆరా తీసినా ఫలితం లేదు.

తెల్లాపూర్‌లో యువతి..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): యువతి అదృశ్యమైన ఘటన తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొమురంభీమ్ కాలనీకి చెందిన గంగమ్మ స్థానికంగా అపార్ట్‌మెంట్‌లోని ఇళ్లలో పనిచేస్తుంది. కాగా మధ్యాహ్నం ఆటోలో బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాబాయ్ దశదిన కర్మకు వెళ్లి..

- అబ్బాయ్ మృతి
- చెరువులో స్నానం చేస్తుండగా ఘటన


చిన్నరాజు

జగదేవ్‌పూర్(గజ్వేల్): బాబాయ్ దశదినకర్మకు వెళ్లి అబ్బాయ్ చెరువులో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని తిగుల్ గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ కృష్ణారెడ్డి, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన సర్థగాని చిన్నరాజు(35), రజిత దంపతులు. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. రాజు గ్రామంలో టెంట్ హౌస్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వరుసకు బాబాయ్‌లు అయినా సర్థగాని యాదగిరి, సర్థగాని నర్సయ్యల దశదినకర్మ కార్యక్రమానికి సోమవారం గ్రామంలోని కుటుంబ సభ్యులతో కలిసి మహాసముద్రం చెరువు కట్ట వద్దకు వెళ్లారు. తలనీలాలు అనంతరం చెరువులోకి దిగి స్నానం చేస్తుండగా రాజు ప్రమాదవశాత్తు నీటిలో మునిగాడు. వెంటనే కుటుంబ సభ్యులు చెరువులోకి దిగి రాజును బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. కళ్ల ఎదుట భర్త మృతి చెందడంతో భార్యాపిల్లల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పాము కాటుతో..


పెద్ది నర్సింహా రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): పాము కాటుకు ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గౌరాయపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పెద్ది నర్సింహారెడ్డి(57) ప్రతి రోజు మాదిరిగా వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. చేనులో వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కరిచింది. వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు.

ఎద్దు పొడిచి వృద్ధుడు..


రాజయ్య

హుస్నాబాద్‌రూరల్: ఎద్దు పొడవడంతో వృద్ధుడు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన హుస్నాబాద్ మండలం మాలపల్లిలో సోమవా రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన సొల్లు రాజయ్య(75) రోజులాగే బావి వద్ద పశువు లను మేతకు విడిచే క్రమంలో ఎద్దు పొడవడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడు. గమనించిన చుట్టు పక్కల రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోలీసులు హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్య బాలవ్వ ఫిర్యాదు మేరకు ఎస్సై లక్ష్మారెడ్డి కేసు నమోదు చేసుకున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం... గత నెల 30న రాత్రి రామచంద్రాపురం పట్టణంలో ఆర్టీసీ డిపో సమీపంలో గుర్తుతెలియని వృద్ధుడు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని వృద్ధుడిని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ ఈనెల 11న రాత్రి మృతి చెందాడు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు.

మృతదేహం లభ్యం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని రత్నాపూర్ గ్రామ శివారు అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. గుర్తించిన పశువులు కాపరులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై మధుకర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహన్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మతిస్థిమితం లేని వ్యక్తి ఇటువైపునకు వచ్చి ఆకలితో అలమటించి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వయ స్సు 55 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు.

ప్రాణాలు తీసుకుని.. ఆవేదన మిగిల్చి..


ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల ఐదుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు.

ఉరి వేసుకొని మహిళ..


విభూతి జ్యోతి

నిజాంపేట(మెదక్): ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... నిజాంపేటకు చెందిన విభూతి జ్యోతి, నర్సింహులు దంపతులు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత నెలలో మహబూబ్‌నగర్‌కు కుమారుడు అనిల్‌కుమార్‌తో సహా వలస వెళ్లారు. ఈ క్రమంలో కుమారుడికి ఫిట్స్ రావడంతో వాగులో పడి చనిపోయాడు. దీంతో మనస్తాపం చెందిన జ్యోతి(41) ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి చీరతో ఉరి వేసుకుంది. గమనించిన ఆమె భర్త ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే చనిపోయింది.

ములుగులో వివాహిత..


అశ్విని

ములుగు(గజ్వేల్): వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని కొక్కొండ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు... దౌల్తాబాద్ మండలం కోనాయిపల్లికి చెందిన అశ్విని(26)కి కొక్కొండకు చెందిన గుండ్రెడ్డిపల్లి రవిగౌడ్‌తో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు. కాగా కొద్ది రోజులుగా అశ్వినితో భర్తతోపాటు మరిది, అత్త తరుచూ గొడవపడేవారు. ఈ విషయం అశ్విని తన తండ్రికి పలుమార్లు చెప్పినప్పటికీ సర్దుకుపోవాలని సూచించేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి అశ్విని ఇంట్లో ఉరివేసుకుంది. ఆమె మృతి పట్ల అనుమానం వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యానికి బానిసై యువకుడు..


మహబూబ్

శివ్వంపేట(నర్సాపూర్): మద్యానికి బానిసైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని గంగాయిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై మధుకర్‌రెడ్డి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మహబూబ్(25) ప్రైవేటు పరిశ్రమలో కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. మద్యానికి బానిసై కొన్నాళ్ల నుంచి విధులకు వెళ్లకపోవడంతో తల్లి చాంద్‌బీ మందలించింది. ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులు బిజ్లిపూర్‌లో ఫంక్షన్‌కు వెళ్లి రాత్రి 11 గంటలకు ఇంటికి రాగా మహబూబ్ ఇంట్లో ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో..


నెల్లూరి వెంకటేశం

కొడిపల్లి(నర్సాపూర్): అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని సలాబత్‌పూర్‌లో జరిగింది. ఎస్సై మురళి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నెల్లూరి వెంకటేశ్(51) మూడేళ్ల క్రితం అప్పుచేసి కూతురు పెళ్లి చేశాడు. ఓ వైపు పెళ్లికి చేసిన అప్పులు తీరక, మరోవైపు కూతురు జీవితం బాగాలేకపోవడంతో కుటుంబ సభ్యులకు చెప్పుకుని బాధపడేవాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరులేని సమయంలో ఇంటిదూలానికి ఉరివేసుకున్నాడు.

మానసిక ఆందోళనతో..


రెడ్డి ప్రసాద్

చిన్నశంకరంపేట(మెదక్): మానసిక ఒత్తిడితో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని గజగట్లపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నారాయణగౌడ్ కథనం మేరకు... గ్రామానికి చెందిన రెడ్డి యాదగిరి కుమారుడు ప్రసాద్(20) ఇంటి వద్దే ఉంటూ పనులు చేసుకుంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత బైక్ తీసుకుని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో స్నేహితులు, బంధువుల వద్ద ఆరా తీశాడు. సోమవారం ఉదయం రెక్కల గుట్ట వద్ద బైక్ కన్పించడంతో గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి వెళ్లి వెతకగా చెట్టుకు ఉరివేసుకుని విగతజీవిగా కనిపించాడు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

కారుకు అడ్డుగా వెళ్లి దంపతులపై దాడి

వట్‌పల్లి(అందోల్): మద్యం మత్తులో ఇద్దరు యువకులు దంపతులపై దాడి చేశారు. ఈ ఘటన సోమవారం మండలంలోని అల్మాయిపేట వద్ద చోటుచేసుకుంది. ఎస్‌ఐ పాండు వివరాల ప్రకారం... టేక్మాల్ గ్రామానికి చెందిన భక్తుల వీరప్ప ఆయన సతీమణి వరలక్ష్మితో కలిసి సంగారెడ్డి నుంచి వస్తున్న క్రమంలో అందోల్ గ్రామానికి చెందిన జాఫర్, షాహిద్ బైక్‌పై వస్తూ కారును ఓవర్‌టేక్ చేశారు. ఈ క్రమంలో ముందుకు వెళ్లి బైక్‌ను కారుకు అడ్డుపెట్టి కారు నడుపుతున్న వీరప్పను బయటకు లాగి దాడి చేశారు. ఈ క్రమంలో ఆయన సతీమణిపై కూడా దాడి చేయగా అటువైపుగా వెళ్లేవారు అడ్డుకున్నారు. ఈ దాడిలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆ ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

జహీరాబాద్ టౌన్: మున్సిపల్ పరిధిలోని రంజోల్‌లో అక్రమ నిర్మాణాలను మున్సిపల్, రెవెన్యూ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య సోమవారం తొలగించారు. రంజోల్ గ్రామ పరిధిలోని 111 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో కొంత మంది అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. సుమారు 10 అక్రమ కట్టడాలను గుర్తించారు. గ్రామంలో ఒక రోజు ముందు దండోరా వేయించి అనంతరం జేసీబీతో అక్రమ కట్టడాలు, రేకుల షెడ్లను కూల్చివేశారు. ప్రభుత్వ స్థలంలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిందితుడికి జీవిత ఖైదు

మెదక్ మున్సిపాలిటీ: ఓ కేసులో నిందితుడికి కోర్టు జీవితఖైదుతోపాటు, జరిమాన విధించింది. జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు వివరాలు... సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం సేవాలాల్ తండాకు చెందిన ఫకీరానాయక్ 2020 నవంబర్ 10న జిల్లా కేంద్రంలోని ఓ కల్లు దుకాణం వద ఓ మహిళను పరిచయం చేసుకున్నాడు. ఆమెతో మాటలు కలిపి చేగుంట రోడ్ వైపు ఉన్న ధర్మకుంట సమీపంలోకి తీసుకెళ్లి కామవాంఛ తీర్చుకున్నాడు. అనంతరం ఇద్దరి మధ్య డబ్బుల విషయంలో వాగ్వాదం జరిగింది. మాటామాటా పెరగడంతో ఫకీరానాయక్ పక్కన ఉన్న బాటిల్‌ను పగులగొట్టి మహిళ గొంతు కోసి హత్య చేశాడు. ఈ ఘటనపై అప్పట్లోనే కేసు నమో దు చేసిన పోలీసులు సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితుడికి జీవిత ఖైదుతోపాటు, రూ.15 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

పది ప్రత్యేక తరగతుల పరిశీలన


ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న డీఈఓ


పుస్తకాన్ని డీఈఓకు అందజేస్తున్న రామకృష్ణ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నిజాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి ప్రత్యేక తరగతులను డీఈఓ వెంకటేశ్వర్లు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. పాఠశాలలో సదుపాయాలు, తరగతుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. పదిలో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తేవాలన్నారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామకృష్ణకు అభినందన

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నిజాంపూర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణను సోమవారం డీఈఓ వెంకటేశ్వర్లు అభినందించారు. వివరాల ప్రకారం.. స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసర్చ్ అండ్ ట్రైనింగ్ తెలంగాణ, నేషనల్ సెంటర్ ఫర్ స్కూల్ లీడర్‌షిప్(నీపా న్యూఢిల్లీ) సంయుక్త ఆధ్వర్యంలో స్కూల్ లీడర్‌షిప్ అకాడమీ తెలంగాణ ట్రయల్ బ్లేజర్స్ 2025 పేరుతో పుస్తకాన్ని ప్రచురించింది. ఇందులో హెచ్‌ఎం రామకృష్ణతో పాటుగా అదే పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయురాలు సునీతకు స్థానం దక్కింది. విద్యాభివృద్ధికి హెచ్‌ఎం రామకృష్ణ చేస్తున్న కృషిని డీఈఓ అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రామకృష్ణ ట్రయల్ బ్లేజర్స్ పుస్తకాన్ని డీఈఓ వెంకటేశ్వర్లుకు అందజేశారు. కార్యక్రమంలో నిజాంపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు రాజశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ సైదులు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

పటాన్‌చెరు టౌన్: యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని యాంటి నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ సైదులు అన్నారు. సోమవారం సాయంత్రం పటాన్‌చెరు మండలం ఐనోల్ గ్రామంలో హైదరాబాద్ బేగంపేట్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థినులతో ఎన్‌ఎస్‌ఎస్ వింటర్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంప్ వద్ద మాదకద్రవ్యాలతో కలిగే నష్టాలపై డీఎస్పీ అవగాహన కల్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచడంతో పాటు సమాజంపై అవగాహన కల్పిస్తుందన్నారు. చదువు మీరు కోరుకున్న లక్ష్యాన్ని దగ్గర చేస్తుందని తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాలకు అలవాటు పడితే పోలీసులకు, అధ్యాపకులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నరసింహులు, డాక్టర్ ఎం.మధుకర్, నార్కొటిక్స్ సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.